# ఎడిటర్

"వున్న వుద్యోగాలన్నిటిలోనూ ఒకటో రకమైనవి రెండు; మొదటిది బడిపంతులు వుద్యోగం. రెండోది ఎడిటర్ వుద్యోగం" అంటూండేవాడు విశ్వనాథం.

"ఏం?" అని నేను ప్రశ్నిస్తూండేవాణ్ణి.

"బొజ్జలోనీళ్ళు కదలక! హాయిగా కుర్చీలో విగ్రహంలా కూచోడం, ఎవో కథకులూ వ్యాసకర్తలూ వారికి తోచినవి పంపుతూంటారు. వచ్చినవాటిలో మంచివి, పాఠకలోకానికి అభిరుచిని కలగచేసేవి ఏరుకోడం, అంతేకదూ? ప్రపంచ జ్ఞానం వున్నవాడెవడైనా చెయ్యగలుగు ఎడిటర్ పని," అని తేలికగా అనేసేవాడు.

వోరి వెధవాయ్! ఎంత సులువుగా చెప్పేసావురా! సూక్ష్మంలో మోక్షం అన్నట్టు—అనుకుంటూ నాలో నేను నవ్వుకునేవాణ్ణి.

పదీ అయ్యేటప్పటికి ఆఫీసులో హాజరు కావాలి. హాజరవడంలో ఏమాత్రం లేటయినా లేటుమార్కు. ఒక నెలలో మూడు లేటుమార్కులు అయితే ఒక బ్లాకుమార్కు, మూడు బ్లాకుమార్కులు వచ్చాయంటే మా ప్రొప్రయిటరు యిచ్చే జీతంలోంచి పది రూపాయిలు విరగ్గోస్తాడు.

"సబ్బుబిళ్లా, యింకా ఏమిటో" అని ఏమిటో మా ఆవిడ చెప్తూండగానే ఆఫీసుటైమైపోయిందని, బెంచీ ఎక్కిస్తాడేమో

మేస్టరని గబగబా హైస్కూలుకి పోయే కుర్రాడిమాదిరిగా తొందరగా పడవడంచేత, యీ భౌతిక కాయం విశ్రాంతి కోరుకుంటుంది.

తీరికగా కూచుని అలసట తీర్చుకునేలోపున బంట్రోతు వృత్తరాలకట్ట తీసుకొచ్చి బల్లమీద పెడ్తాడు.

అందులో సుమారు ఓ పది పన్నెండు వ్యాసాలదాకా వున్నట్లు చూసీ చూడడం తోటే గోచర మవుతుంది అమ్మయ్య! కంపోజిటర్ బాధ పడక్కర్లేదు. మేటరు దొరికింది. నాయనా!''అని నూత్న ప్రియాసందర్శనంచేత ప్రేమికుడి మనస్సులో కలిగే వుత్సాహతరంగాల్లాటివి నా మనస్సులోకూడా వుప్పొంగిపోవడం మొదలెడ్తాయి. శ్మశాన భూమిలో హరిశ్చంద్రుడికి ప్రత్యక్షమైన దేవుడిలా, నా వెనకాల 'మేటర్ సార్' అని అంటూ కంపోజిటర్ ప్రత్యక్ష మవుతాడు. నేను వులిక్కిపడి 'ఓ అరగంట వుండవోయ్!' అని వోపికతో అంటాను.

చూస్తునుగదా యిక వ్యాసాలవిషయం !!! ఒకాయన వ్యాసం భూతద్దంతో చదవాలేమో అని సందేహం కల్గుతుంది. యింకో ఆయన వ్యాసం నాల్గోక్లాసులో చదువుకునే కుర్రాడిచేత కాపీ చేయించినట్లుంటుంది. ఒకాయన శీర్షికకు లతలూ అవీ రంగుపెన్సిల్‌తో చెక్కుతాడు; చూడగానే నవ్వు వస్తుంది. మరో ఆయన వ్యాసం శీర్షిక యీలా వ్రాస్తారు. ''ఆర్య కాలమునాటి హిందూదేశపు సాంప్రదాయ

ములకూ బ్రిటీషు పాలనముక్రింద వున్న హిందూదేశము నకునూ గల తాదాత్మ్యములు!" శీర్షిక అనేది ఓ వాక్యం కాదనీ పాఠకుని మనస్సులో మొట్టమొదట అభిరుచిని కలుగ జేసేది శీర్షికే అనీ, కొందరు తెలుగురచయితలు తెల్సుకో లేక పోయ్యారుగదా అని. నవ్వూ విచారమూ వస్తాయి. వో పెద్దమనిషి వో చిన్నపద్యం పంపించి పేమెంట్ సెటిల్ చెయ్యనిదే ప్రచురించకండేం, అని వారిస్తాడు. మేము పద్యాలు ప్రకటించమని పదేపదే పత్రికలో చెప్పుకుంటూనే వుంటాం. బహుశా ఆయనెవరో భావకవి కాబోలు! ఆయనకి సామాన్యవిషయాల్తో ఎక్కువ సంబంధం వుండదు. అంచేత మా విజ్ఞాపనని ఎప్పుడూ చూసిన పాపాన పోలేదను కుంటాను.

కట్టంతా చూస్తాను. ఏవో ఒకటో రెండో నచ్చుతాయి. పదిన్నరా అవగానే మళ్లీ కంపోజిటర్ ప్రత్యక్షమవుతాడు.

"మేటర్, సార్."

"ఇదిగో" అని అంటూ సెలక్టు చేసినవ్యాసాన్ని యిస్తాను. ఆకలితో అల్లల్లాడే అబ్బాయికి అన్నంపెట్టినట్టు, తృప్తిని వెలిబుచ్చే మొహంతో కంపోజిటర్ నిష్క్రమిస్తాడు.

ఎక్స్ఛేంజికి వచ్చినపేపర్లు ఒకటి తరవాత ఒకటే చూస్తూవుంటాను. ఇంతట్లో 'భావవీధి' సంపాదకులు వేం చేస్తారు. "దయచెయ్యండి! దయచెయ్యండి!!" అని సగౌరవంగా ఆహ్వానిస్తాను. ఆయన ఆఫీసుపన్నెండుగంటలకి.

అంచేత, రోజూ ఆఫీసుకి పోయేటప్పుడు మా ఆఫీసులోకి వచ్చి నన్నోమారు చూసిపోతుంటారు.

"ఈ రోజుల్లో వ్యాసకర్తల్లోనూ, కథకుల్లోనూ బహు బాధగా వుండండీ," అని సంపాదకసంబంధమైన సంభాషణ మొదలెడ్తాను.

"అవునండీ," అని ఆయన నాగోలకి తలవూపుతూ, తన గోల నాతో చెప్పుకుని, తన మనోభారాన్ని తగ్గించుకుంటాడు.

ఓ పావుగంట కూచున్న తర్వాత లేచిపోబోతాడు.

"మేటర్ గురించి చాల చిక్కు పడ్తున్నానండీ," అంటాను.

"ఓకత్తెర దగ్గర పెట్టుకోని ఎక్స్చేంజికి వచ్చిన పేపర్ల లోంచి కత్తిరించవయ్యా!" అని సలహా యిస్తాడు.

నవ్వుతూ "మా ప్రొప్రయిటరుకు తెలుగువచ్చేండీ! అలా చేస్తే జీతంతగ్గిస్తాడు," అని అధికారియెడ వుండే వినయ విధేయతల్ని మూషికోవాసిదగ్గర ఎలా నటించాలో అలా నటిస్తాను.

ఆయన 'సెలవు' అంటూ వెళ్ళిపోతాడు. నేను మళ్ళీ కుర్చీలో చతికిల బడతాను.

*　　*　　*　　*

ఇలాగా, అలాగా కాలం గడుస్తూండగానే వంటిగంట అవుతుంది. కాఫీ అని కడ్పు కంగారుపడుతుంది. లేస్తాను.

దగ్గరవున్న కాఫీ హోటల్కి వెళ్తూంటాను. వాటిలో ఎవడో స్నేహితుడు అగుపించి 'ఓహో సంపాదక మహాశయులా నమస్కారం!' అని అంటాడు.

"నమస్కారం" అని నేనూ అంటాను.

"ఎక్కడికి?"

"కాఫీ వేళ కాదండీ, హోటల్ కి పోతున్నా."

"పదండి. నేనూ వస్తా."

ఇద్దరం కాఫీ తాగుతాం. బిల్లు యిచ్చేందుకు పర్సు తీస్తాను. 'నేనిస్తాలెండి' అంటాడాయన. చప్ప చప్పగా వూరుకొంటాను. సిగరెట్లూ కిళ్ళీలూ నేనేకొంటాను. కిళ్లీ నములుతూ సిగరెట్టు కాలుస్తూ ఆఫీసువైపుకు వస్తూవుంటాం. 'ఇక సెలవా?' అని అర్థిస్తా డాయన.

"ఊఁ" అన్నట్లు తలవూపుతాను.

మళ్ళీ నా వ్యాసాలకట్టలూ, నా పత్రికలూ, నేనూ.

* * * *

రెండవుతుంది ఎవరో భావకవి వస్తాడు, భావకవిని వర్ణించడం అనవసరం కదా!!!

"ఏమండీ, నేనీమధ్యనే ప్రేమమీద కొన్ని పద్యాలు వ్రాసితిని. మీ పత్రికలో ప్రచురింతురనే భావంతో తమ దర్శనార్థమై వచ్చితిని." అని సవినయంగా భావకవి భాషలో అడుగుతాడు.

"పద్యాలు మా పత్రికలో ప్రచురించమండీ" అని నిష్కర్షగా చెపుతాను.

"వాఙ్మయమనే అంటుకి నేను కవిత్వమనే పువ్వుని..." అని కాసేపు కవిత్వంలో వుండే మజా నాకు చెప్తాడు.

"ఈ పద్యాలు చాలా బావున్నాయని నామిత్రులు మెచ్చుకొన్నారండీ," అంటాడు.

"అవునే? కన్సిడర్ చేసి, తర్వాత మీకు తెలియజేస్తాను," అని విన్నవించుకుంటూ ఆ పద్యాల కట్టని డస్కులోకి త్రోసేస్తాను.

"నమోం నమః" అంటూ ఆయన సెలవు తీసుకుంటాడు.

* * * *

మూడవుతుంది. సూట్ హేట్‌తో ఎవరో యువకుడు వస్తాడు.

"గుడ్ మార్నింగ్! మిస్టర్ ఎడిటర్!" అని అంటాడు హేటుతీస్తూ

"వెరీగుడ్ మార్నింగ్," అని నేనూ అంటా ఆ అతిథి కూచునేందుకు కుర్చీ చూపిస్తూ.

"నా వ్యాసం చూశారా? అని అంటా డాయువకుడు జేబురుమాల్తో మొహాన్ని విసురుకుంటో.

"తమ పేరు?" అని అడుగుతా నమ్రతతో.

"సీన్"

"తమ వ్యాసం పేరు?"

"వాడు లవ్ చేసాడు."

"ఓహో! అది మీరేనా వ్రాసింది."

"ఏం, అలా అంటున్నారు?"

"ఏం లేదు లెండి," అని డస్కులోంచి అతని వ్యాసాన్ని తీసి బల్లమీద పెట్టాను.

"చదివారా?"

"చదివాను."

"బావుందా లేదూ?"

"వోమాదిరిగా వుంది."

"ఊహు!" అంటూ జేబులోకి తోసేస్తా డా యువకు డా వ్యాసాన్ని.

ఇక మొదలెడ్తాడు గాసిప్ 'షెల్లీ' గురించీ, 'షేక్స్పియర్' గురించీ, 'బైరన్' గురించీ, 'బేకన్' గురించీ, 'షా' గురించీ, 'షెకవ్' గురించీ తనకి తోచిన విమర్శలన్నీ వాగుతాడు. ఇంకో పదిమంది పేర్లు వరసని చెప్పేస్తాడు. ప్రవరాఖ్యుడు నపుంసకుడనీ, వరూధిని సెక్సు ఎబ్నార్మలనీ ధాటీగా అంటాడు. తెలుగువాళ్ళు వెర్రిపుల్లాయిలని, తేలుస్తాడు చివరకి. తెలుగు దేశంలో పత్రికలన్నీ ఏడుస్తున్నాయనీ, పత్రికాసంపాదకులు అసమర్థులనీ వాళ్ళకి వాఙ్మయం అంటే ఏమిటో తెలీదనీ మాట్లాడుతాడు.

యువకుల్లో వుండే లోపేయిది. పుస్తకంలో పది పేజీలు చదవగానే ఆ పుస్తకంమీద తాను అథారిటీ అంటాడు. అవతలవాడు తనకు తెలీదని అనుకుంటాడేమోనని, అవతల

వాణ్ణి అసలు మాట్లాడనే మాట్లాడ నియ్యాడు. తానే వాగు తాడు వసపోసిన పిట్టలా. వాగుడికి తలాతోకా వుండదు.

నాలుగున్నర అవుతుంది. తన వ్యాసాన్ని ప్రచురించ డానికిగాను అంగీకరించ లేదని మనస్సులో తిట్టుకుంటూ, పైకి తిట్టే తిట్టనట్టు 'గుడ్ బై' చెప్తూ వెళ్ళిపోతాను.

"వెర్రినాగమ్మ !" అనుకొంటూ మనస్సులో.

నాఖర్మం కాలడంచేత కాని, ఈ షష్టాల్సాందరి చేతనూ తిట్లు పడటం నాకెందుకని మనసులో చింతిస్తూంటాను.

*   *   *   *

అయిదవుతుంది బెల్ కొడతాడు. బతికానురా బాబూ అంటూ బయటికి వస్తూంటాను. మెట్లు దిగుతూంటే ఏ సనాతనాచార్యో ప్రత్యక్షమవుతాడు. 'బహుకాల దర్శ నం' అని అంటూ దాయన దణ్ణాలెడుతూ.

నేనూ దణ్ణం పెడ్తాను.

"తమ దర్శనార్థమే వస్తు..." అని యింకేమీమో చెప్పబోతాడు.

"ఏం ?"

"రామాయణము నేను తెలుగులో వ్రాసినాను."

"అవుతే !" అని ప్రశ్నిస్తా, ఆయన సందేశం పూర్తి అవకపూర్వమే !

"తమ పత్రికా రాజములో..."

"మా పాఠకులకి పురాణగాథలు అవసరంలేదు, ఇప్పటికే యీ మెట్టవేదాంతాల్లోటీ, ఈ పనికిమాలిన పురాణగాథల్లోటీ, ఆ భ్రమం చెవ్వులు చిల్లులుపడ్డాయి."

టకీమని చెప్పిన నా జవాబుకి తెల్లమొహం వేసి 'సెలవా' అంటూ నిరుత్సాహంతో, మెట్లమీదనించే వెనక్కి తిరిగి వెళ్ళిపోతా డాయన.

* * * *

బీచికి వెళ్దామనుకుంటూ వుంటాను.

ఇంతలో, గృహమూ, గృహిణీ, సంసారమూ, పిల్లలూ మనోవీధిలో తాండవ మాడతారు.

"బీచికి రేపు వెళ్ళవచ్చు. ఇంటికి పోదాం" అని నిశ్చయించుకొని గృహోన్ముఖుణ్ణి అవుతాను.

వెళ్ళి వెళ్ళగానే మా ఆవిడ తలకాయనొప్పి అనో, డొక్కలోనొప్పి అనో, నడుంనొప్పి అనో కంప్లెయింట్ చేస్తుంది. ఏదీకాకపోతే వాకిటుంటుంది.

రాత్రిపడ్తుంది, తెల్లవారుతుంది, కాఫీతాగుతాను. తొందర భోజనం, మళ్ళీ మామూలు.

సమాప్తి.